కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం


స్తంభంపై కూలిన చెట్టు

మలక్‌పేట: మూసారంబాగ్‌ బస్తీ రామాలయం లోని రావి చెట్టు గాలికి గుడి ఆవరణం బయట ఉన్న విద్యుత్‌ స్తంభంపైన కూలింది. ఇది వరకే శిథిలామైన ఉండటంతో స్తంభం విరిగి కిందప డింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో బస్తీవాసులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్‌ సరఫరా నిలిపివేయించారు. నిత్యం ఇక్కడే పిల్లలు ఆడుకుంటుంటారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని బస్తీ నాయకులు పేర్కొన్నారు. గుడిలో ఉన్న రావిచెట్టు వేర్లు బయటికి తేలి చెట్టుతో పాటు స్తంభం కూడా కూలే ప్రమాదం ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోస్టర్‌ ఆవిష్కరణ

ఎల్‌బీనగర్‌: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ కారుడు కొండా లక్ష్మణ్‌ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని మన్సూరాబాద్‌ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంజి సత్తయ్య డిమాండ్‌ చేశారు. కొండా లక్ష్మణ్‌ బాపూజీ ఫెడరేషన్‌ నాయకుడు రాపోలు జ్ఞానేశ్వర్‌ పిలుపు మేరకు సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన గొప్ప నాయకుడన్నారు. తెలంగాణ ఏర్పాటుకు మంత్రి పదవిని త్యాగం చేసిన మహానేత కొండా లక్ష్మణ్‌ బాపూజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, లక్ష్మినర్సింహా, జ్ఞానేశ్వర్‌, సత్యనారాయణ, రమేష్‌, వెంకటేశం, సుదర్శన్‌ పాల్గొన్నారు.

మార్కెట్‌ అభివృద్ధికి కృషి చేయండి


నర్సింహారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెకొలేకర్‌ లక్ష్మి

చాదరఘాట్‌: హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని, అందుకు సిబ్బంది కృషి చేయాలని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ చెకొలేకర్‌ లక్ష్మి అన్నారు. నూతనంగా ఎస్‌జీఎస్‌గా నియమితులైన చిలుక నర్సింహారెడ్డిని సోమవారం ఆమె సన్మానించి మాట్లాడారు. హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌కు మంచి పేరు ఉందని రైతులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమములో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్‌ శ్రీనివాస్‌, వైస్‌చైర్మన్‌ కోట్ల శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ట్యాంకర్‌ డ్రైవర్‌ రిమాండ్‌

నాగోలు: వ్యక్తి మృతికి కారణమైన ట్యాంకర్‌ డ్రైవర్‌ను సోమవారం నాగోలు పోలీసులు రిమాండ్‌ చేశారు.ఆదివారం ఉదయం నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని జైపురికాలనీ చౌరస్తాలో వాటర్‌ ట్యాంకర్‌ బీభత్సవం సృష్టించి ద్విచక్ర వాహనంపై ఎక్కించడంతో తాపీమేస్త్రీ గంజి మల్లికార్జున్‌ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన శివకృష్ణ చికిత్స పొందుతున్నాడు. శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సరూర్‌నగర్‌కు చెందిన ట్యాంకర్‌ డ్రైవర్‌ పాపయ్యను రిమాండ్‌కు తరలించారు.

ఈ సారీ ముంపు తప్పదా!

- వర్షాకాలం ముంచుకొస్తున్నా పూర్తికాని వరదకాలువ పనులు
- వివిధ కారణాలతో ఆగిపోతున్న వైనం
- కాలనీవాసుల్లో భయం
- అధికారుల మౌనం


న్యూగడ్డిఅన్నారం కాలనీలో పూర్తికాని వరదనీటి కాలువ పనులు

ఎల్‌బీనగర్‌: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో వరదనీటి కాలువ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. ఈ పనుల జాప్యంతో నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అంచనాలు పెరగడంతో పనుల్లో జాప్యం జరుగుతుంది. ఇంజినీరింగ్‌ అధికారుల పర్యవేక్షణ లోపంతో పనుల్లో జాప్యం ఏర్పడుతుంది పలువురు వాపోతున్నారు.వర్షాకాలం ముంచుకొస్తున్న వరద కాలువ పనులు పూర్తి కాక పోవడంతో ఈ సారి కూడా తమ కాలనీలకు ముంపు తప్పదా?


ఆదర్శనగర్‌కాలనీలో..

అని పలువురు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్షాలు ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

- సుష్మా నుంచి మన్సూరాబాద్‌ పెద్దచెరువు వరకు రూ.10 కోట్లతో ఐదు సంవత్సరాల క్రితం వరద నీటి కాలువ పనులు ప్రారంభించారు. వరదనీరు మన్సూరాబాద్‌ పెద్దచెరువులోకి చేరే విధంగా ప్రణాళికలు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్‌ ప్రాంతం వద్ద వివాదంతో కోర్టుకు వెళ్లడంతో పనులు ఆగిపోయాయి.
- మన్సూరాబాద్‌ హయత్‌నగర్‌ ప్రాంతంలో చేపడుతున్న ట్రంక్‌లైన్‌ తరచూ అవాంతరాలతో నిలిచిపోతుంది. అంచానాలు పెరగిపోవడంతో నూతనంగా అంచనాలు వేసి పనులు చేపడుతున్నారు. అయినప్పటికి పనుల్లో కదలిక లేకుండా పోతోంది.
- గడ్డిఅన్నారం డివిజన్‌ న్యూ గడ్డిఅన్నారం కాలనీలో వరదనీటీ కాలువలు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీటి కాలువల కోసం సీసీ రోడ్లను తవ్వకాలు చేపట్టడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి .
- నాగోలు డివిజన్‌ సాయినగర్‌కాలనీ నుంచి ఆదర్శనగర్‌కాలనీ వరకు రూ.1.89 కోట్లతో చేపడుతున్న వరదనీటి కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జూన్‌ మొదటివారంలో పూర్తి కావాలని నిర్దేశించుకుని పనులు చేపట్టితే ఇప్పటి వరకు 50 శాతం పనులు మాత్రమే చేయగలిగారు. వర్షాలు వస్తే ఆర్టీఏ కార్యాలయం మునిగిపోయే ప్రమాదం ఉంది.

సమస్యల పరిష్కారానికి చర్యలు


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌లో సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌ రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారంలో బస్తీ దవాఖానా లైన్‌లో సోమవారం ఆమె సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయని ఈ రోడ్డు ఏర్పాటుతో ఎన్నో రోజులుగా ఉన్న ప్రధాన సమస్యకు చెక్‌ పడుతుందన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సైట్‌ ఇంజినీర్‌ ఏడుకొండలు, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ సత్తిరెడ్డి, కాలనీవాసులు ప్రభాకర్‌, శ్రీధర్‌గౌడ్‌, బ్రహ్మచారి, శ్రీకాంత్‌, జీవన్‌, బీజేపీ అధ్యక్షుడు దినేష్‌,సురేందర్‌ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకుండా పనిచేయాలి


అధికారులతో సమావేశమైన కార్పొరేటర్‌ అరుణ

సైదాబాద్‌: పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకుండా పనిచేయాలని సైదాబాద్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణ జీహెచ్‌ఎంసీ అధికారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. సోమవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమేవేశం నిర్వహించారు. మంగళవారం నుంచి పారిశుద్ధ్యంపై నిర్వహించనున్న స్పెషల్‌ డ్రైవ్‌ కార్యక్రమం గురించి కార్పొరేటర్‌ వారికి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తరలించే క్రమంలో కచ్చితమైన సమయపాలన పాటించాలన్నారు. కాలనీలు, బస్తీల్లో గృహాల నుంచి క్రమం తప్పకుండా చెత్తను సేకరించాలన్నారు. కాలనీలు, బస్తీలవాసులు పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని ఆమె కోరారు. సమావేశంలో ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్‌, గణేష్‌, దినేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

జేఈఈ-అడ్వాన్స్‌డ్‌లో 'నారాయణ' సత్తా



సాక్షి,సిటీబ్యూరో: జేఈఈ- అడ్వాన్స్‌లో దిల్‌సుఖ్‌నగర్‌ నారాయణ డే డివిజన్‌ విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో 56 ర్యాంక్‌తో ప్రణీల్‌ రాపోలు సత్తా చాటగా, 500 లోపు తొమ్మిది ర్యాంకులు, 1000 లోపు 19 ర్యాంకులు, 5000 లోపు 58 ర్యాంకులు, 10 వేల లోపు 69 ర్యాంకులతో జాతీయ స్థాయి ఐఐటీలో సీటు కోసం అర్హత సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కోర్‌ డీన్‌ రాధాకృష్ణ ప్రశంసించారు.

నియామకం


వినయ్‌కుమార్‌కు నియామకపత్రం ఇస్తున్న కృష్ణయ్య

నాగోలు: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్‌ హైదరాబాద్‌ ప్రధాన కార్యదర్శిగా నాగోలు సాయినగర్‌ కాలనీకి చెందిన మద్దెల వినయ్‌కుమార్‌ను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్‌. కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌ మాట్లాడుతూ.. చట్టసభలలో బీసీ రిజర్వేషన్లు సాధించేంత వరకూ బీసీల యుద్ధం కొనసాగుతుందని బీసీలందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

రికార్డు స్థాయిలో ఉల్లి దిగుమతి

చాదర్‌ఘాట్‌: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం రికార్డు స్థాయిలో ఉల్లి దిగుమతులతో మార్కెట్‌ కళకళలాగింది. వివిధ రాష్ట్రాల నుంచి 141 లారీలు రాగా దాదాపు 425000 బస్తాలు దిగుమతి అయినట్లు ఎస్‌జీఎస్‌ చిలుక నర్సింహారెడ్డి తెలిపారు.

మలక్‌పేటలో రాకపోకలు ప్రారంభం

చాదర్‌ఘాట్‌: నల్గొండ చౌరస్తా నుంచి యథావిధిగా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. రెండ్రోజుల క్రితం ఈ రహదారిపై డ్రైనేజీకి మరమ్మతు చేపడుతండటంతో ఇటీవల ట్రాఫిక్‌ను మళ్లించారు. పనులు పూర్తవడంతో సోమవారం నుంచి రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

6232 మందికి బియ్యం పంపిణీ

చాదర్‌ఘాట్‌: మలక్‌పేట సర్కిల్‌-1 పరిధిలో సోమవారం వరకు 6232 మంది రేషన్‌ బియ్యం తీసుకున్నట్లు ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు తెలిపారు. గత రెండు రోజులుగా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా రేషన్‌ పంపిణీ చేశామని ఈ నెల 30వ తేదీ వరకు పంపిణీ చేస్తారని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ఎల్‌బీనగర్‌: కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌ రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. సచివాలయనగర్‌ కాలనీసంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకున్న సందర్భంగా సోమవారం కార్పొరేటర్‌ను ఆయన నివాసంలో కలిసి కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో పార్కులు, వీధి దీపాలు, మంచినీటి సమస్యలను తీర్చాలని కాలనీవాసులు కోరగా సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. డివిజన్‌ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో సాంబశివరావు, బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు, రవికుమార్‌, గోపాల్‌, సత్యనారాయణ, తెల్లంశెట్టి హేమ హరీష్‌, పంతంగి శ్రీధర్‌కుమార్‌ పాల్గొన్నారు.

మూడు నెలల బియ్యం తీసుకోవాలి


బియ్యం పంపిణీ పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి ఒక్కరు మూడు నెలల రేషన్‌ బియ్యాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని లింగోజిగూడ కార్పొరేటర్‌ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని పలు రేషన్‌ దుకాణాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నెలల రేషన్‌ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పేదలందరూ సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తుంటంతో కాస్త ఆలస్యమవుతుందని లబ్ధిదారులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్‌, సుధీర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నరేష్‌, శివ పాల్గొన్నారు.

పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలి


కార్పొరేటర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

హస్తినాపురం: డివిజన్‌ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు భాగస్వాములైతే త్వరితగతిన పూర్తవుతాయని హస్తినాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. సోమవారం డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి కార్పొరేటర్‌ను కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా సుజాతానాయక్‌ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్‌, రాజుగౌడ్‌ పాల్గొన్నారు.

రహదారుల ఆధునీకరణకు ప్రాధాన్యం


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ శ్వేత

సైదాబాద్‌: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఐఎస్‌సదన్‌ కార్పొరేటర్‌ జంగం శ్వేత జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. సోమవారం ఐఎస్‌సదన్‌లోని గవర్నమెంట్‌ ప్రెస్‌ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారుల ఆధునీకరణకు కూడా ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, కాలనీ ప్రతినిధులు దేవేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌, జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నవీన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జయప్రకాష్‌ పాల్గొన్నారు.

కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా సుష్మా ఫ్లైఓవర్‌ పనులు


కాలనీవాసులతో చర్చిస్తున్న అధికారులు

ఎల్‌బీనగర్‌: కాలనీవాసుల అభిప్రాయాల మేరకు సుష్మా ఫ్లైఓవర్‌ పనులు చేపడుతామని జాతీయ రోడ్లు భవనాల ఎస్‌ఈ రాజనాథ్‌ అన్నారు. సుష్మా ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా ఉన్న కాలనీవాసులు, కార్పొరేటర్లతో సోమవారం అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లర్లతో కూడిన ఎలివేటెడ్‌ ఫ్లైఓవర్‌ చేపడుతున్నామన్నారు. గతంలో ఉన్న ఫ్లైఓవర్‌ డిజైన్‌లో మార్పులు చేసి జాతీయ రహదారికి ఇరువైపులా కాలనీవాసులకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. 950 మీటర్ల పొడవుతో ఫ్లైఓవర్‌ నిర్మాణం ఉంటుందని, ప్రతి 70 మీటర్లకు అండర్‌ పాస్‌ ఏర్పాటు చేశామని, మొత్తం ఏడు అండర్‌పాస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ చొరవతో నూతన డిజైన్లు ఏర్పాటు అయ్యాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ విశాల్‌, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, క్లెం నవజీవన్‌రెడ్డి, బీజేపీ నేత సామ రంగారెడ్డి, వివిధ కాలనీల అసోసియేషన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.


వికలాంగుల కార్పొరేషన్‌ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న సంస్థ చైర్మన్‌ వీరయ్య, డైరెక్టర్‌ శైలజ


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న హయత్‌నగర్‌ సర్కిల్‌ డీసీ డాక్టర్‌ తిప్పర్తి యాదయ్య


వనస్థలిపురం కమలానగర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్‌ కల్లెం నవజీవన్‌రెడ్డి, సామ రంగారెడ్డి


ఎన్టీఆర్‌నగర్‌లో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న అరవింద్‌ శర్మ, పెండ్యాల నగేష్‌


సైదాబాద్‌లో జాతీయ జెండా ఎగుర వేసిన సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి

జయ జయహే తెలంగాణ..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను ఎల్‌బీనగర్‌, మలక్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయజెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎందరో వీరుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందన్నారు. నవ తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

-ఎల్‌బీనగర్‌, మలక్‌పేట జోన్ల బృందం


విద్యార్థుల రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో..


వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్‌ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి


మార్కెట్‌లో జెండా ఆవిష్కరించిన చైర్‌పర్సన్‌ చెకొలేకర్‌ లక్ష్మి


కర్మన్‌ఘాట్‌లోని గాంధీ విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి


మూసారంబాగ్‌లో..